క్లుప్తంగా

శ్రీశైలానికి పాదయాత్ర



వెంకటాపురం నుంచి బయలుదేరిన బిణిగేరి గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరికి చెందిన 800 మంది పంచలింగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకుడు శ్రీనివాసులు నాయన ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. శ్రీనివాసులు స్వామి మాట్లాడుతూ ఏటా కార్తీక మాసంలో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్నామని చెప్పారు. గ్రామస్తులందరూ నంద్యాల జిల్లా ఆత్మకూరు దగ్గర ఉన్న వెంకటాపురం నుంచి ఆడవుల్లో రెండు రోజులు పాటు నడుస్తూ శ్రీశైలం చేరుకుంటామని చెప్పారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



పరదేశప్ప తాత

ఆస్పరి: మండలంలోని అట్టేకల్లులో వెలసిన అవధూత పరదేశప్ప తాత 14వ ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పరదేశప్ప తాత సమాధికి గంగపూజ, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పరదేశప్ప తాత పల్లకీని మేళతాళాలతో భక్తులు ఊరేగించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ నరసింహారావు

ఆలూరు: ఖాతాదారులు, మదుపరులకు మరింత మెరుగైన సేవలందిస్తామని యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.నరసింహారావు తెలిపారు. స్థానిక బళ్లారి రోడ్డు సమీపంలోని చంద్రశేఖర్‌గౌడు కాంప్లెక్స్‌లో సోమవారం బ్రాంచ్ మేనేజర్ కె.మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో 68వ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఆర్ఎం మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 67 బ్రాంచ్‌లు ఉండగా ప్రస్తుతం ఆలూరు శాఖతో 68కి చేరాయన్నారు. ట్రెజరీ అధికారి శ్రీనివాసులు, వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు, ఉద్యోగులు,రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



శిశువును చూపుతున్న ఈఎంటీ వీరేష్

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన రాధమ్మ అనే మహిళ పురిటి నొప్పులతో బాధ పడుతుండటంతో ఆశా వర్కర్ సుంకులమ్మ సోమవారం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దేవనకొండ నుంచి 108 వాహనం కప్పట్రాళ్ల గ్రామానికి చేరుకుని తిరిగి కోడుమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా రాధమ్మకు పురిటినొప్పులు ఎక్కువవడంతో ఈఎంటీ వీరేష్, పైలెట్ అన్వర్‌బాషా సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రసవం చేశారు. తల్లి, కుమార్తె క్షేమంగా ఉన్నారని, ఇద్దరినీ ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

పత్తికొండ(తుగ్గలి) : మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ జన్మదినం సందర్భంగా సోమవారం పలువురు రక్తదానం చేశారు. పట్టణంలోని వారి స్వగృహంలో అభిమానుల నడుమ తండ్రి ఎస్వీ సుబ్బారెడ్డి, భర్త కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డితో కలిసి నాగరత్నమ్మ కేక్ కట్‌చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పట్టణ ప్రముఖులు, న్యాయవాదులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ దీపిక, టీఎండీ హుసేన్, పల్లె ప్రతాపరెడ్డి, సోమశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, న్యాయవాది దామోదర ఆచారి, మధు, కృష్ణారెడ్డి, నెట్టికల్లు తదితరులు ఉన్నారు.

రేషన్.. అరకొరగానే!

- చాలాచోట్ల బియ్యం మాత్రమే వేస్తున్న వైనం
- కార్డుదారులకు అందని చక్కెర, కందిపప్పు, జొన్నలు
- ప్రభుత్వం ఇవ్వకపోతే తామేం చేస్తామంటున్న డీలర్లు
- నాలుగు సరుకులు ఇస్తున్నామని ప్రకటిస్తున్న కూటమి సర్కారు
- ప్రజలకు అందని పూర్తిస్థాయి రేషన్

ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదు. ప్రభుత్వం మాత్రం బియ్యం, చక్కెర, కందిపప్పు, జొన్నలు అందజేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధిక ప్రాంతాల్లో కేవలం బియ్యంతో సరిపెడుతుండగా, కొన్ని చోట్ల బియ్యంతో పాటు చక్కెర, మరికొందరు డీలర్లు చక్కెర స్థానంలో జొన్నలు పంపిణీ చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. ప్రభుత్వం ఇవ్వకపోతే తామేం చేస్తామని డీలర్లు సమాధానమిస్తుండటంతో గత్యంతరం లేక ఇచ్చిన అరకొర సరుకులనే లబ్ధిదారులు తీసుకెళ్తున్నారు.



పంపిణీ చేసిన జొన్నలు,బియ్యం



నంచర్లలో రేషన్ సరుకుల కోసం గుమికూడిన లబ్ధిదారులు

చిప్పగిరి: ప్రతి నెల పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు అందించే సరుకులు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఈ నెలలో ప్రభుత్వం నాలుగు సరుకులు అందిస్తున్నట్లు ప్రకటించింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఒకటి,రెండు సరుకులు పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం జొన్నలు, కందిపప్పు, చక్కెర, బియ్యంతో కలిపి మొత్తం నాలుగు సరుకులు పంపిణీ చేయాలి. మండలంలోని చాలా గ్రామాల్లో ఒకటి లేదా రెండు సరుకులు తప్ప నాలుగు సరుకులు అందించడం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో మొత్తం 24 రేషన్ దుకాణాలు ఉండగా 7,885 మంది కార్డుదారులు ఉన్నారు. ఈ నెలలో బియ్యం 1,211.56 క్వింటాళ్లు, జొన్నలు 220.29 క్వింటాళ్లు, కంది పప్పు 25.01క్వింటాళ్లు, చక్కెర 69.96 క్వింటాళ్లు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని డీలర్లందరూ నాలుగు రకాల సరుకులు తెచ్చుకున్నారని అధికారులు చెబుతుండగా.. లబ్ధిదారులకు మాత్రం ఒకటి, రెండు సరుకులు పంపిణీ చేసి చేతులు దులుపుకుంటుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లోపించిన పర్యవేక్షణ..

రేషన్ పంపిణీపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపించడంతో కార్డుదారులకు పూర్తిస్థాయిలో సరుకులు అందడం లేదనే విమర్శలున్నాయి. రేషన్ పంపిణీ సమయంలో దుకాణాలను అధికారులు తనిఖీ చేసి అందజేస్తున్న సరుకులు, తూకం, అర్హులకు వేస్తున్నారా అని పరిశీలించిన దాఖలాలు లేవు. ఎక్కడైనా మీడియాలో వార్తలు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేసి ఆ తరువాత యథామామూలే అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో పంపిణీ ఇష్టారాజ్యంగా సాగుతుండటంతో ప్రజలు నష్టపోతున్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు



రేషన్ పంపిణీలో డీలర్లు అవకతవకలు పాల్పడితే డీలర్ షిప్ రద్దు చేస్తాం. నవంబర్ నెలకు సంబంధించి నాలుగు సరుకులు కచ్చితంగా కార్డుదారులకు పంపిణీ చేయాలి. తూకాల్లో, సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందితే విచారణ చేసి చర్యలు చేపడతాం. సరుకులు అందకపోతే లబ్ధిదారులు ఫిర్యాదు చేయాలి.

– ఇజాజ్ అహమ్మద్, తహసీల్దార్

రేపు మండల సర్వసభ్య సమావేశం

తుగ్గలి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు. అలాగే అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే 57వ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక గ్రంథాయలంలో నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కవితాబాయి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తకపఠనం, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న వారిని స్మరించుటతోపాటు స్వాతంత్ర్య సమరయోధుల గురించి వ్యక్తలతో ప్రసంగం, 17న రాష్ట్రంలో స్వతంత్ర పోరాటంపై ప్రముఖులు, స్థానిక స్వతంత్ర సమరయోధుల ప్రసంగాలు, 18న గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు వేడుకలతోపాటు పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల అందజేత ఉంటుందని వివరించారు.

వందశాతం అక్షరాస్యత సాధించేలా చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వయోజన విద్య అధికారి ఫయాజ్

కృష్ణగిరి: మండలంలో వందశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా వయోజన విద్య అధికారి ఫయాజ్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఆయన వలంటీర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య కింద జిల్లాలోని 9 మండలాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా చేసేందుకు చర్యలు చేపట్టామని, అందులో కృష్ణగిరి కూడా ఉందన్నారు. గ్రామాల్లో చదువురాని 15 ఏళ్ల పైబడి వారిని ముందుగా గుర్తించి వారికి వలంటీర్లు చదువు చెప్పాల్సి ఉంటుందన్నారు. మండలంలో 3,500 మందిని గుర్తించి అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. అక్షరాస్యులుగా మార్చడంతోపాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, మొబైల్ వాడకంపై తీర్చిదిద్దాలన్నారు. వెలుగు ఏపీఎం మహేశ్వరయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరోజమ్మ, సీసీలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ఆలూరు: రైతులు, వ్యవసాయ కార్మికులు అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని ఆలూరు ఎస్‌ఐ సి.వి.నరసింహులు సూచించారు. మండలంలోని కురువెళ్లి, హత్తిబెళగళ్ గ్రామాల్లో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవనం సాగించాలని చెప్పారు. పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. సర్పంచ్‌లు రవి, షేకుంబీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ల పరిశీలన

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛభారత్ మిషన్ కింద మంచినీటిని సరఫరా చేసేందుకు సింటెక్స్‌లు వచ్చాయి. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణమ్మ సింటెక్స్‌లను పరిశీలించారు. సింటెక్స్ ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అందరికీ న్యాయం అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్. భారతి

పత్తికొండ(తుగ్గలి) : అవరోధాలను అధిగమించి అందరికీ న్యాయం అందించాలనే ధ్యేయంతో న్యాయసేవాధికార సంస్థ ఆవిర్భవించిందని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి తెలిపారు. సోమవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయసేవ దినోత్సవాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. న్యాయం ముందు అందరూ సమానమేనన్నారు. బలహీన వర్గాలకు ఎలాంటి రుసుము లేకుండా న్యాయ సేవలందించడమే న్యాయ సేవల దినోత్సవ లక్ష్యమన్నారు. న్యాయ సేవ అంటే కేవలం ఉచితంగా న్యాయవాదిని నియమించడం, లోక్ అదాలత్ ద్వారా రాజీలు చేయడం, చట్టాలపై అవగాహన కల్పించడం మాత్రమే కాదని, ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాల ఫలితాలు సత్వరం అర్హులకు అందడంలో ఒక వారధిగా కూడా పనిచేస్తుందని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, న్యాయవాదులు గోపాల్‌రెడ్డి, హుల్తెన్న, ఈరన్న, నాగభూషణ రెడ్డి, మధుబాబు, దామోదర ఆచారి, అశోక్, వెంకటేశ్వర్లు, సరోజాబాయి పాల్గొన్నారు.

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం

పత్తికొండ(తుగ్గలి) : వలసల నివారణలో ప్రభుత్వం, అధికారులు విఫలం చెందారని సీపీఎం మండల కమిటీ సభ్యులు చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పత్తికొండ మండలం మండగిరిలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత ఉపాధి పనులపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అదే సమయంలో ప్రజాపోరు కార్యక్రమానికి వెళ్లిన వెంకటేశ్వరరెడ్డి గ్రామస్తులతో కలిసి అధికారులను నిలదీశారు. ఉపాధి పనులు చేసే కూలీలకు పనిముట్లు, సౌకర్యాలు లేవని, చేసిన పనులకు వేతనాలు సరిగా రాకపోతే కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఉపాధి పనులపై నమ్మకం లేకే కూలీలు వలసలు వెళుతున్నారన్నారు. కూలీలంతా వలసలు వెళ్లాక సమావేశాలు నిర్వహించినా ప్రయోజనం ఉండదన్నారు. సకాలంలో పనులు కల్పిస్తే వలసలు ఎందుకు వెళతారని నిలదీశారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వలసల నివారణకు చర్యలు చేపడుతామని చెప్పి ఎంపీడీఓ, ఏపీఓ వెంకటేశ్వర్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



హొళగుంద జడ్పీ హైస్కూల్‌లో ఆజాద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

హొళగుంద: దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన దేశ మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ విద్యార్థులకు పిలుపుచ్చారు. సోమవారం పాఠశాలలో ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.



వెల్దుర్తిలో విద్యా దినోత్సవం గురించి వివరిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): హిందు, ముస్లిం ఐక్యత కోసం ఎంతగానో కృషి చేసిన మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కరస్పాండెంట్ జీవీ రమణ అన్నారు. వెల్దుర్తిలోని సత్యసాయి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను వివరించారు. హెచ్‌ఎం గఫూర్, డైరెక్టర్ తిప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



చెరుకులపాడు శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): కార్తీక మాస రెండవ సోమవారం సందర్భంగా భక్తులు పరమశివుడికి బిల్వార్చన, రుద్రాభిషేకం, భస్మాభిషేకం తదితర విశేష పూజలు చేశారు. చెరుకులపాడులోని శివాలయంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి అభిషేకార్చనలు చేశారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని ఆరాధించారు. మహిళలు తెల్లవారుజామున నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. బ్రహ్మగుండంలో భక్తులు కోనేటిలో స్నానాలు ఆచరించి స్వామికి ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు.

మద్దికెర : మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో కార్తీక మాసం రెండో సోమవారం శివాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. అలాగే బుగ్గ సంగమేశ్వర దేవాలయంలో కార్తీక మాసం పూజలు ఘనంగా నిర్వహించారు.



దీపాలు వెలిగించిన మహిళలు



బుగ్గలో ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

‘అన్నదాత సుఖీభవ’ అమలు చేయాలి



పత్తికొండలో తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న రామచంద్రయ్య

పత్తికొండ(తుగ్గలి) : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని తక్షణమే అమలు చేసి రైతుల ఖాతాల్లో రూ.20వేలు జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 అందించేవారని గుర్తు చేశారు. రబీ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు రూ.20వేలు కాదు కదా రూ.20 కూడా రైతులకు ఇచ్చిన పాపాన పోలేదని మండిపడ్డారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, ఎంపీటీసీ సభ్యులు పెద్ద వీరన్న పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఎం పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు నారాయణ స్వామి,మండల కార్యదర్శి షాకీర్ అన్నారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పెద్దహోతూరు, మరకట్టు, మనేకుర్తి, హత్తిబెళగల్, కురువళ్లి, అగ్రహారం గ్రామాల్లో పర్యటించారు.

హొళగుంద: ఎన్నికల ముందు ఇచ్చిన హామి మేరకు రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సహాయాన్ని అందించి ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కార్యకర్తలతో కలిసి తహసీల్దారు సతీష్‌కు వినతి పత్రం అందజేశారు.

దేవనకొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండల కార్యదర్శి నరసారావు, నాయకులు వై.నాగేశ్వరరావు, అనుమప్ప, దుబ్బన్న, నరసప్ప పాల్గొన్నారు.

ఆస్పరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అలాగే.. కైరుప్పల, పుష్పాలదొడ్డి, కైరుప్పల, శంకరబండ, హలిగేర, చిరుమాన్‌దొడ్డి గ్రామాల్లో సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు, కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ విస్తృతంగా ప్రచారం చేశారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదని సీపీఎం జిల్లా నాయకులు నాగేష్ విమర్శించారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన చేపట్టే ప్రజాపోరు పోస్టర్లను సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అవిష్కరించారు.

తుగ్గలి : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం పత్తికొండ, తుగ్గలి మండలాల కార్యదర్శులు రంగారెడ్డి, శ్రీరాములు అన్నారు. ప్రజాపోరు ఉద్యమంలో భాగంగా సోమవారం పత్తికొండ, తుగ్గలిలో కరపత్రాలు పంపిణీ చేశారు.ప్రజా సమస్యలపై ఈనెల 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రజాపోరు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మద్దికెర : ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్‌కు అందజేశారు. కోదండరాముడు, గుంత హనుమన్న, బొజ్జన్న పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు



బల్గోట బసవేశ్వరస్వామి ఆలయంలో క్రేన్ ద్వారా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని బల్గోట గ్రామంలో వెలిసిన బల్గోట బసవేశ్వరస్వామి ఆలయంలో కలశం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు వృషభాలను పనులకు తీసుకెళ్లకుండా ఇంట్లోనే ఉంచి పూజలు చేశారు. ప్రతి సోమవారం నాడు వృషభాలను పొలం పనులకు తీసుకెళ్లకుండా పూజలు చేస్తామని స్థానికులు తెలిపారు. ప్రతిష్ఠ అనంతరం గ్రామస్తులు తమ ఆడపడుచులకు ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. ఒడిబియ్యంతో ఆలయానికి చేరుకుని స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.





ఒడిబియ్యంతో ఆలయానికి వెళ్తున్న మహిళలు, ఆలయ గోపురంపై కలశం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లు

తుగ్గలి : మండలంలోని 3 నీటి సంఘాలు, ఒక డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల నిర్వహణకు మైనర్ ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జొన్నగిరి, పగిడిరాయి, చెన్నంపల్లి నీటి సంఘాలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ ధర్మేంద్ర సోమవారం తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, 13న ఓటరు తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. 20న నీటి సంఘాల ఎన్నిక షెడ్యూలు విడుదల కానుందని, 21 నుంచి 23 వరకు ఎన్నిక నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

16నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

తుగ్గలి : ఉప్పర్లపల్లి సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో ఈనెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప్పర్లపల్లి సర్పంచ్ ప్రభాకరరెడ్డి, ఆలయ ధర్మకర్త సుదర్శనరెడ్డి, కార్యనిర్వాహకులు కృష్ణయ్యాచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు, ఉప్పర్లపల్లి గ్రామస్తుల సహకారంతో పురాతన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశామన్నారు. బ్రహ్మశ్రీ బెల్డోణ శ్రీ గుండు రామనాథ శాస్త్రి ఆధ్వర్యంలో 16న గంగపూజ, గోపూజ, జలాధివాసం, దీక్షహోమం, 17న గ్రామోత్సవం, మూలమంత్ర జపాలు, అభిషేకాలు, 18న వేకువజామున విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని వివరించారు.